

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**రాత్రంతా** రకరకాల కలలు వచ్చాయి. ఉదయాన్నే లేచానని భ్రమపడ్డాను. వెంటనే తయారయ్యి నిన్నటి పేపర్ వర్క్ పూర్తి చేయడానికి బయలుదేరాను. అదృష్టవసాత్తు హనీష కూడా నాతో వచ్చింది. నేను అనుకున్న దానికన్నా ఎంతో వేగంగా పని పూర్తయ్యింది.

"ప్రొఫెసర్‌కి ఇచ్చివస్తాను" చెప్పాను.

"అపాయింట్ మెంట్ ఉందా?" అడిది.

"లేదు. అవసరమా?" కాస్త వ్యంగ్యంగా అడిగాను.

"అవును. ఆయన క్లాసులోనో, మీటింగ్‌లోనో ఉంటే?"

"ఓ... ఆలోచించలేదు" కాస్త సిగ్గుపడ్డాను.

"ఆఫీస్ అవర్స్ ఎప్పుడు?"

"అంటే?"

"ప్రొఫెసర్స్‌కి మామూలుగా ఆఫీస్ అవర్స్ ఉంటాయి. అప్పుడు వాకిన్ వెళ్ళొచ్చు. మీ ప్రొఫెసర్‌కి ఎప్పుడో కనుక్కో."

"సరే" అని ఫోన్‌లోంచి ఆయనకి ఈ మెయిల్ చేసాను. ఈలోగా ఇల్లు చేరాము. ఉదయం నుండి తినలేదని హనీష గుర్తు చేస్తేకానీ గమనించలేదు. ఇద్దరం కలిసి భోంచేసిన తరువాత ఈ మెయిల్స్ తెరిచాను. 'ఇప్పుడు రావచ్చు' అని ప్రొఫెసర్ ఇచ్చిన గంట క్రితం ఈ మెయిల్ చూసి కాళ్ళూ చేతులు ఆడలేదు. నా కంగారు చూసి హనీష బిత్తరపోయింది. సంగతి వివరించి "ఏం చెయ్యాలి?" అడిగాను.

"ఇప్పుడు వెళ్ళు" సలహా ఇచ్చింది.

"ఈ మెయిల్ చెయ్యనా?" అడిగాను.

"డైరెక్ట్ వెళ్ళు. టెన్షన్ పడకు" అంది.

సరే అని ఆయనకి ఇవ్వాల్సిన కాగితం తీసుకుని గబగబా వెళ్ళాను. నిజానికి రెండు నిమిషాల నడకే అయినా నాకు మాత్రం అది గంటలా అనిపించింది. ఆయన ఆఫీసు తలుపు చేరేసరికి నాకు అలసట విపరీతంగా కలిగింది.

"మే ఐ కమిన్ సార్?" ఆయాసంగా అడిగాను.

"యెస్", ఏదో పనిలో ఉండి నా వైపు చూడకుండా అన్నారు.

"సారీ సర్. ఐ మిస్డ్ యువర్ ఈ మెయిల్" బిక్కు బిక్కుమనుకుంటూ అన్నాను.

ఒక రెండు క్షణాలు బుక్‌లో ఏదో రాసి, తలెత్తి నన్ను చూసారు.

"ఇట్స్ ఓకే నో ప్రాబ్లం. సిట్" అన్నారు.

కూర్చుని ఊపిరి గట్టిగా తీసుకున్నాను. అయినా అలసట తీరలేదు. ఉద్యోగానికి తెచ్చిన కాగితం ఇచ్చి " ఐ ఫినిష్డ్ పేపర్ వర్క్" అన్నాను.

నా చేతిలోంచి కాగితం తీసుకుని "దట్ వజ్ క్విక్" అన్నారు.

"యెస్" ఏమనాలో తెలీక అన్నాను.

నా మొహాన్ని ఓ రెండు క్షణాలు గమనించి "రిలాక్స్" నవ్వారు. అయోమయంగా చూసాను.

"టేక్ ఎ డీప్ బ్రెత్" మళ్ళీ నవ్వారు.

నేనూ నవ్వి అలసట తీరేంత వరకు దీర్ఘంగా ఊపిరి పీల్చాను.

ఆయన ఆ కాగితాన్ని స్కేన్ చేసి, కంప్యూటర్‌లో ఏదో చేసారు.

అది పూర్తవ్వగానే "వెల్కం ఆన్ బోర్డ్" అన్నారు.

"థాంక్యూ" వెంటనే నాకు ఉద్యోగం వచ్చిందన్న సంగతి స్ఫురించింది. అన్నయ్య భాషలో చెప్పాలంటే 'సంతోషంతో మొహం పొంగిపోయింది' అది ఆయన కూడా గమనించి నవ్వారు.

"రెడీ టు స్టార్ట్ వర్కింగ్?" అడిగారు.

"యెస్" వెంటనే అన్నాను.

"లెట్స్ గో టు లాబ్" అన్నారు.

మరీ ఇవాళే పని మొదలుపెట్టాలని అనుకోలేదు. ఆయన నిజంగానే అడిగారన్నమాట.

ఆయన వెనకే నడుస్తూ వెళ్ళాను. ఈయన ఆఫీసు బిల్డింగ్ పక్కనే ఉన్న బిల్డింగ్‌లోకి వెళ్ళాము. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న ఓ గదిని తన దగ్గర ఉన్న తాళం చెవితో తెరిచారు. ఆయన వెనకే నేను వెళ్ళాను. లాబ్‌లో ఉన్న వాళ్ళందరికీ నన్ను పరిచయం చేసారు. వాళ్ళల్లో అభిషేక్ కూడా ఉన్నాడు. అక్కడ చాలామంది అండర్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఈ వయసులోనే రీసర్చ్ చేస్తున్నారు. అదే నేను ఇంజనీరింగ్‌లో ఇలాంటి రీసర్చ్ చేయగలిగి ఉంటే ఎంత బావుండేది అనుకున్నాను. బహుశా ఈ పాటికి ఇండియన్ స్పేస్ ఏజెన్సీలో జాబ్ చేస్తూ ఉండేదాన్ని కాబోలు. అందరూ వాళ్ళు చేస్తున్న రీసెర్చ్ గురించి కొంత చెప్పారు.

కానీ నాకు ఏమీ అర్ధంకాలేదు. దాంతో చిన్నబోయాను. ఓ టేబుల్, కంప్యూటర్‌ని చూపించి "దిస్ ఈజ్ యువర్ డెస్క్" అన్నారు.

"థాంక్యూ" అని చుట్టూ చూసాను. అందరూ వాళ్ళ పనుల్లోకి వెళ్ళిపోయారు. అలా పనిచేసేంత కెపాసిటీ నాకుందా అని అనుమానం కలిగింది. నా ఆలోచనలు వినబడ్డాయనుకుంటా "యూ విల్ లర్న్ ఎవ్రిథింగ్. డోంట్ వర్రీ. ఎవ్రీవన్ లర్న్డ్ ఆన్ ద జాబ్" అన్నారు.

"ఓకే" ఏమనాలో అర్ధం కాలేదు.

ఆయనతో కలిసి తన ఆఫీసుకి వెళ్ళాను. ఓ ఫార్మ్ ఇచ్చి, ఫిల్ చేసి ముందు రిసెప్షన్‌లో ఇమ్మన్నారు. అది లాబ్ కీ కోసం అని వివరించారు. అందులో కేవలం నాపేరు, స్టూడెంట్ ఐడి, సిగ్నేచర్ తప్ప రాయడానికి ఏమీలేవు. వెంటనే నింపేసాను. నాకు రెండు టెక్స్ట్ బుక్స్ ఇచ్చి వాటిల్లో ఏం చాప్టర్లు చదవాలో స్టిక్ నోట్ మీద రాసి ఇచ్చారు. ఆ బుక్స్ చూడటానికి బండలా ఉన్నా, కొన్ని చాప్టర్లే కాబట్టి ఎక్కువ ఉండవని భావించాను. అవి చదివి, ప్రశ్నలు ఉంటే ఆఫీస్ అవర్స్‌లో రమ్మని చెప్పారు. డౌట్లు లేకపోతే తిరిగి వచ్చే వారం అదే సమయానికి రమ్మన్నారు.

థాంక్స్ చెప్పి బయలుదేరాను. పేపరుని రిసెప్షన్‌లో ఇచ్చి, అక్కడ ఉన్న లాలీపాప్ తీసుకోవచ్చా అని అడిగాను.

"టేక్ ఏజ్ మెనీ ఏజ్ యూ వాంట్" అంది.

ఓ రెండు తీసుకుని ఇంటికి బయలుదేరాను. మొత్తానికి ఇంటి నుంచి ఇంత దూరం వచ్చి ఏరోస్పేస్‌లో ఏదో సాధించాలని వచ్చినందుకు మొదటి అడుగు ఫలితమైందన్న తృప్తి వచ్చింది. ఇంటికి నడిచేంతసేపు నా ముఖంలో నవ్వు అలానే ఉంది. ఇళయరాజా పాట వింటే అమ్మ ఎంత చిరాకుగా ఉన్నా ఎలా క్షణంలో మామూలుగా అయిపోతుందో, నాకు ఇప్పుడు అంతే తృప్తిగా ఉంది. నా మొహంలో చిరునవ్వు తరగలేదు.

ఇంటికి వెళ్ళేసరికి హనీష లేదు. ఆయన ఇచ్చిన పుస్తకాలు చూసాను.
'మాడర్న్ కంప్రెసిబుల్ ఫ్లో' మరియు 'హైపర్ సానిక్ అండ్ హై టెంపరేచర్ గాస్ డైనానిక్స్' వారం ఉంది కాబట్టి ఆయన చెప్పిన చాప్టర్లు మాత్రమేకాక, మొత్తం పుస్తకం చదువుదామని నిశ్చయించుకున్నాను. హనీష ఇంట్లో లేదు కాబట్టి 'సినిమా చూద్దాం' అనే పేచీ లేదు. ఈ ఉత్సాహం ఇలా ఉండగానే ఓ కప్పు టీ కలుపుకుని ఏండ్రసన్ రాసిన మోడర్న్ కంప్రెసిబుల్ ఫ్లో తెరిచి అందులో కొట్టుకుపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story